సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం ౹ 11 ౹ జూన్ ౹ 2025



చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33 వేలు, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



డైయాలసిస్

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మవరంలో డయాలసిస్ రోగులు నరకం చూస్తున్నారు. యూనిట్‌లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం

36.1°/21.7°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్


దాడులు సరికాదు: ఉషశ్రీచరణ్



పెనుకొండ రూరల్: ప్రజాస్వామ్యంలో దాడులు సరైన చర్య కాదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ అన్నారు. 'సాక్షి' కార్యాలయాలపై టీడీపీ నేతల దాడులు, కూటమి ప్రభుత్వం సూచనలతో జరిగిన కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్ట్‌ను ఆమె ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'సాక్షి' టీవీ డిబేట్‌లో ఓ వ్యక్తి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయగానే.. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆయన్ను నిలువరించే ప్రయత్నం చేశారన్నారు. చర్చలో ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలను అన్యాయంగా 'సాక్షి'కి ఆపాదించి కార్యాలయాలపై కూటమి నేతలు దాడులకు దిగడం దుర్మార్గమన్నారు. ఇది ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడిగానే పరిగణించాలన్నారు. 'సాక్షి'లో జరిగిన చర్చలో ఆ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అతని వ్యక్తిగతమన్నారు. అయినప్పటికీ అందుకు బాధ్యుడిని చేస్తూ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం అక్రమమన్నారు. వెంటనే ఆయన్ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై దాడులు చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు.

17 మండలాల్లో వర్షం

- అత్యధికంగా గోరంట్ల మండలంలో 42.6 మి.మీ వర్షపాతం నమోదు



పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ జిల్లాలోని 17 మండలాల పరిధిలో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా గోరంట్ల మండలంలో 42.6 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఇక హిందూపురం మండలంలో 29.2 మి.మీ., పరిగి 19.4, సోమందేపల్లి 19.0, రొద్దం 18.6, లేపాక్షి 15.4, అగళి 12.6, చిలమత్తూరు 9.6, గుడిబండ 9.4, కొత్తచెరువు 8.6, తనకల్లు 8.6, రొళ్ల 5.2, పుట్టపర్తి 4.2, మడకశిర 3, అమరాపురం 2.2, ధర్మవరం 1.4, పెనుకొండ మండలంలో 1.4 మి.మీ మేర వర్షం కురిసిందన్నారు. ఈనెల 17వ తేదీ వరకూ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు వేరుశనగ విత్తుకోవచ్చని సూచించారు.

భారీ వర్షాలున్నాయ్.. జాగ్రత్త

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించిందని జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

రైతులకు నాణ్యమైన విత్తనం

- మంత్రి సవిత, ఎమ్మెల్యే సింధూరారెడ్డి



మహిళా రైతుకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే, అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్‌లో రైతులందరికీ నాణ్యమైన విత్తనం అందజేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తెలిపారు. మంగళవారం పుట్టపర్తి మండలం పెడపల్లి రైతు సేవా కేంద్రంలో వేరుశనగ విత్తన పంపిణీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విత్తనకాయలు నాణ్యతలేకపోతే వెనక్కు ఇచ్చి మరో బస్తా తీసుకెళ్లాలన్నారు. అధికారులు కూడా సాగు చేసే ప్రతి రైతుకూ విత్తన కాయలు అందేలా చూడాలన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ డబ్బు రైతు ఖాతాల్లో జమ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. అనంతరం పెడపల్లి రైతు సేవా కేంద్రంలోని విత్తన కాయలను పరిశీలించారు. పలువురు రైతులకు విత్తన కాయల బస్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగ్లీబాయి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, ఆర్డీఓ సువర్ణ, జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) సుబ్బారావు, వివిధ సంఘాల డైరెక్టర్లు సామకోటి ఆదినారాయణ, సోమశేఖర్, అంజనేయులు, శ్రీరాంనాయక్, ఏడీఏలు కృష్ణమీనన్, సనావుల్లా, రైతులు పాల్గొన్నారు.

దుర్మార్గంపై మహిళాగ్రహం

- మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ 'పురం'లో భారీ నిరసన
- రెడ్‌బుక్ రాజ్యాంగంతోనే మహిళలకు రక్షణ లేదు
- అత్యాచారాల పాపం చంద్రబాబుదే
- హిందూపురంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక



పార్టీ శ్రేణులతో కలిసి హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న టీఎన్ దీపిక, ఈరలక్కప్ప, మధుమతిరెడ్డి తదితరులు

చిలమత్తూరు: రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులపై మహిళాలోకం కన్నెర్ర చేసింది. మహిళలకు రక్షణ కల్పించలేని కూటమి సర్కార్ పాలనను నిరసిస్తూ మంగళవారం హిందూపురంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించింది. వైఎస్సార్ సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో 'సేవ్ ఆంధ్ర ఉమెన్' పేరిట మహిళలు కదం తొక్కారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎన్ దీపిక మాట్లాడుతూ... రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా.. బాలికలు, మహిళలకు రక్షణ కరువైందని మండిపడ్డారు. రోజూ ఏదో ఒక చోట మహిళలు, అన్నెంపుణ్యం ఎరుగని బాలికలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనంతటికీ రాష్ట్రంలోని కూటమి సర్కారే కారణమన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలపై జరిగిన అత్యాచారాల పాపం సీఎం చంద్రబాబుదే అన్నారు. రాష్ట్రంలో రోజుకో అత్యాచార ఘటన వెలుగుచూస్తోందన్నారు. ఏడాదిగా శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పగా గ్యాంగ్‌రేప్‌లు, ఆపై హత్యలు జరుగుతున్నాయన్నారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో ఓ దళిత బాలికపై 14 మంది నెలల తరబడి అత్యాచారం చేశారంటే మనం ఎలాంటి సమాజంలో ఉన్నామో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇక అనంతపురంలో గిరిజన బాలిక తన్మయిని దారుణంగా హత్య చేయడం, చౌళూరులో బాలికపై అత్యాచారయత్నం వంటి ఘటనలు జరగకముందే పోలీసులు ఎందుకు ఆపలేకపోతున్నారని ప్రశ్నించారు. శాంతి భద్రతలను టీడీపీ నేతలు, కార్యకర్తలకు అప్పజెప్పిన పోలీసులు... ఏం జరిగినా చూస్తూ ఊరుకోవడం బహుశా దేశంలోనే ఎక్కడా ఉండదన్నారు. రాష్ట్రంలో నిర్వీర్యమైన వ్యవస్థలను చూస్తుంటే భయమేస్తోందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దిశ చట్టం ద్వారా రూపొందించిన యాప్ వల్ల ఎంతోమంది మహిళలకు నిమిషాల్లోనే రక్షణ దొరికేదన్నారు. వైఎస్ జగన్ హయాంలో ప్రవేశపెట్టిన వ్యవస్థలను నిర్వీర్యం చేయడం ద్వారానే మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. ఇకనైనా బాలికలు, మహిళలు స్వేచ్ఛగా తిరిగే అవకాశం కల్పించాలని కోరారు.

రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారు

సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చేస్తున్నారని మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మండిపడ్డారు. ఏడాది కూటమి పాలనలో అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు, అక్రమ కేసులు, దౌర్జన్యాలు, కబ్జాలు తప్ప వేరే ఏవీ కనిపించడం లేదన్నారు. మహిళలపై ఇన్ని దారుణాలు జరుగుతున్నా.. చంద్రబాబు వ్యవహరిస్తున్నారన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు

కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. మహిళలు, బాలికలపై ఇన్ని దారుణాలు జరుగుతున్నా.. హోంమంత్రి అనిత స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. చౌళూరులో బాలికపై జరిగిన అత్యాచారయత్నం లాంటి ఘటనలు మహిళలకు రక్షణ లేదని చెప్పడానికి ఉదాహరణగా నిలుస్తున్నాయన్నారు.

ఇప్పటికైనా మేల్కొండి

మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ... రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ఇలాంటి ప్రభుత్వం దేశంలో మరెక్కడా ఉండదన్నారు. 'సాక్షి'లో వస్తున్న కథనాలు, డిబేట్‌లతో కూటమి సర్కార్ వైఫల్యాలు ప్రజలకు తెలుస్తున్నాయని, దీంతో డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా 'సాక్షి'కి సంబంధంలేని విషయాన్ని ఆపాదిస్తూ కార్యాలయాలపై దాడులు చేయిస్తున్నారన్నారు. అక్రమంగా కేసులు పెట్టి జర్నలిస్టులను అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన పని తీరు మార్చుకుని పేదలకు మేలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి, హిందూపురం ఎంపీపీ రత్నమ్మ, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు కవితారెడ్డి, కౌన్సిలర్ షాజియా సహారాభాను, కురుబ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ఏ శివ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అసిఫుల్లా, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూర్తి, యువజన విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, బూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, పార్టీ మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, సయ్యద్ నిస్సార్, రాము, మాజీ మండల కన్వీనర్ శ్రీరామిరెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శబరీష్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్ట్ సిగ్గుచేటు
- మహిళలు, బాలికలపైన అత్యాచారాలు, హత్యలతో ప్రజాస్వామ్యం ఖూనీ
- వైఎస్సార్ సీపీ 'పురం' పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు రమేష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి. చిత్రంలో టీఎన్ దీపిక, ఈరలక్కప్ప తదితరులు

చిలమత్తూరు: రాష్ట్రంలో అరాచకశక్తులు రాజ్యమేలుతున్నాయని వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు రమేష్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన హిందూపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పురం, మడకశిర నియోజకవర్గాల సమన్వయకర్తలు టీఎన్ దీపిక, ఈరలక్కప్పలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. టీవీ చానల్‌లో జరిగిన చర్చలో ఎవరో ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలను 'సాక్షి'కి ఆపాదిస్తూ సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కేందుకే కూటమి సర్కార్ పక్కా ప్రణాళికతో కొమ్మినేనిని అరెస్ట్ చేయించిందన్నారు. పైగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు నమోదు చేయించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో పచ్చ మీడియా ఇష్టారీతిన వ్యవహరించినా పత్రికా స్వేచ్ఛను కాపాడామన్నారు. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఓ సినిమా ఫంక్షన్‌లో ఆడది కనిపిస్తే ముద్దయినా....కడుపైనా... అంటూ చెప్పేందుకు కూడా వీలుకాని భాష మాట్లాడిన ఎమ్మెల్యే బాలకృష్ణపైనా కేసులు పెడతారా అని ప్రశ్నించారు. చేయని తప్పులను సాక్షి పత్రిక, చానెల్‌పై ఆపాదించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబు రెడ్‌బుక్ పేరుతో చెడ్డపేరు మూటగట్టుకుంటున్నారన్నారు. ఇలాంటి పరిపాలన ఎన్నడూ చూడలేదన్నారు. ప్రస్తుతం అంబేడ్కర్ రాజ్యాంగం ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఈ పరిస్థితులు మారాలన్నారు.

మహిళలకు రక్షణ ఎక్కడ?

అనంతపురం జిల్లాలో గిరిజన విద్యార్థిని తన్మయిని పాశవికంగా అంతమొందించిన తీరు.. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో ఓ దళిత బాలికపై 14 మంది నెలల తరబడి కీచక పర్వం కొనసాగిందంటే రాష్ట్రంలో ఎంతటి దుర్మార్గపు ప్రభుత్వం నడుస్తోందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఒక మాజీ మహిళా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గం, ఒక మహిళా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా, ఒక మహిళ హోం మంత్రిగా ఉన్న రాష్ట్రంలో ఇలాంటి అఘాయిత్యాలు జరగడంపై ఈ పాలకులు ఏమని సమాధానం చెబుతారన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు తప్పు తెలుసుకొని ప్రజలకు క్షమాపణ చెప్పడంతో పాటు మహిళల రక్షణకు కఠినంగా వ్యవహరించాలని రమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే వైఎస్ జగన హయాంలో దిశ యాప్ ద్వారా బాలికలు, మహిళలకు అందిన సేవలను మళ్లీ అందించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, వైఎస్సార్ సీపీ మండలాల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, రాము, సయ్యద్ నిస్సార్, ఎంపీపీ రత్నమ్మ పలువురు నేతలు పాల్గొన్నారు.

యోగాతో రుగ్మతలు దూరం

- పర్యాటక కేంద్రాల్లో యోగాపై అవగాహన
- యోగా దినోత్సవంలో కలెక్టర్ చేతన్



యోగాలో పాల్గొన్న అభ్యాసకులు (ఇన్‌సెట్) యోగా చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

లేపాక్షి: రోజూ యోగా సాధన చేయడం వల్ల శారీరక రుగ్మతలు దూరమవుతాయని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఒత్తిడిని అధిగమించి మనసును ప్రశాంతంగా ఉంచుకోవడంతో పాటు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. మే 21న పుట్టపర్తి నుంచి యోగాంధ్ర ప్రారంభించామని వెల్లడించారు. ఇటీవల పుట్టపర్తిలో రెండు వేల మందితో, కదిరిలో 3 వేల మందితో యోగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇపుడు లేపాక్షిలోనూ యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 21న విశాఖపట్నంలో 5 లక్షల మందితో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి మోదీ పాల్గొంటారని తెలిపారు. అనంతరం యోగా గురువులు శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి అభ్యాసకులతో వివిధ ఆసనాలను వేయించారు. కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు కూడా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ, టూరిజం శాఖ ఇన్‌చార్జి నరసయ్య, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు, ఆయుష్ డాక్టర్ సాహితీ, ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, ఐసీడీఎస్, వెలుగు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అదనపు గదులు ప్రారంభించిన కలెక్టర్

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలోని అదనపు గదులను మంగళవారం ఉదయం కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రారంభించారు. అదేవిధంగా విద్యాలయలోని ఎన్‌సీసీ గదులను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యాలయంలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్



నల్లమాడ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి అత్యాచారానికి పాల్పడిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు. బుక్కపట్నం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన యువకుడు పోతులయ్య నల్లమాడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 సంవత్సరాల వయసున్న బాలికను ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. మాయ మాటలతో అత్యాచారం సాగించాడు. విషయాన్ని బాలిక ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోతులయ్యపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బది'లీలలు' ఇంతింత కాదయా!

- వ్యవసాయ, అనుబంధ శాఖల్లో ఇష్టారాజ్యం
- బలవంతులు, ధనవంతులు కోరుకున్న చోట పోస్టింగ్
- ఏఓ జాబితాలు ఆపేయాలని ఉత్తర్వులు!



అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ, అనుబంధ శాఖల్లో బదిలీల పర్వం ఇష్టారాజ్యంగా జరిగినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధనవంతులు, బలవంతులు పైచేయి సాధించి కోరుకున్న చోట పోస్టింగ్ సాధించినట్లు తెలిసింది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పాడి, మత్స్య, మార్కెటింగ్‌శాఖల్లో పెద్ద ఎత్తున ఉద్యోగుల బదిలీలు జరిగాయి. సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే చాలా మంది ఉద్యోగులు బదిలీలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు గాలికి వదిలేశారని విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధుల పలుకుబడి, వారి సిఫారసులు, అలాగే పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆ పోస్టులకు రూ.లక్షల్లోనే బేరం..

వ్యవసాయ శాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలో ఒక డిప్యూటీ డైరెక్టర్ శివప్రసాద్ బదిలీ అయ్యారు. 9 మంది అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీఏ), దాదాపు 57 మంది అగ్రికల్చర్ ఆఫీసర్స్ (ఏఓ)కు బదిలీ ఉత్తర్వులు అందాయి. అయితే ఇందులో అనంతపురం ఏడీఏ, రూరల్ ఏఓతో పాటు మరో నాలుగు స్థానాలకు పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆ శాఖలో ప్రచారం సాగుతోంది. ఏడీఏ పోస్టుకు రూ.20 లక్షలు, ఏఓ పోస్టుకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షలు, మరో ఐదారు పోస్టులకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు బేరసారాలు జరిగాయనే ప్రచారం సాగుతోంది. ఇందులో అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో పాటు అసోసియేషన్ రాష్ట్ర స్థాయి నేతలు, కొందరు అగ్రి ఇన్‌పుట్ డీలర్లు చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. అధికారులు ఇచ్చిన ఆప్షన్లు, ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో సంబంధం లేకుండా అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ అంటూ అడ్డదిడ్డంగా బదిలీలు చేసినట్లు చెబుతున్నారు. కాగా వ్యవసాయశాఖ ఏఓ బదిలీ జాబితాలు ఆపేయాలని మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు వచ్చినట్లు చెబుతున్నారు.

అంతా గందరగోళం..

పశుసంవర్ధకశాఖలో బదిలీ ఉత్తర్వులు వెలువరించి.. ఆ తర్వాత తక్షణమే వెనక్కి తీసుకోవడంతో గందరగోళం నెలకొంది. జాబితాలు వెల్లడించొద్దని డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. అలాగే మత్స్యశాఖ పరిధిలో రెండు ఎఫ్‌డీఓ పోస్టుల విషయం కూడా తేల్చలేదు. పట్టు పరిశ్రమ శాఖ రెండు జిల్లాల అధికారులకు బదిలీ ఉత్తర్వులు అందాయి. అనంతపురంలో పనిచేస్తున్న డి.అంజనేయులు కర్నూలుకు, కర్నూలులో పనిచేస్తున్న విజయకుమార్ అనంతపురానికి బదిలీ అయ్యారు. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా జేడీ పద్మమ్మ చిత్తూరుకు, అక్కడ పనిచేస్తున్న శోభారాణి శ్రీ సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. పట్టు పరిశ్రమల శాఖలో కొందరు సెరికల్చర్ అధికారులు (ఎస్‌ఓ) బదిలీలు ఇష్టారాజ్యంగా జరిగాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో చాలా మంది అధికారులు మంగళవారమే ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డిని కొనసాగించారు. ఏపీడీగా ఉన్న ఫిరోజ్‌ఖాన్‌ను కర్నూలు ఏపీఎంఐపీడీ ఏపీడీగా బదిలీ చేశారు. శ్రీశైలంలో పనిచేస్తున్న ధనుంజయను ఇక్కడ ఏపీఎంఐపీ ఏపీడీగా బదిలీ చేశారు. ఇక్కడ హెచ్‌ఓగా ఉన్న పల్లవికి ఏడీగా పదోన్నతి కల్పించి కుప్పం ఏడీగా బదిలీ చేశారు. ఉద్యానశాఖ ఏడీ నరసింహారావును నెల్లూరుకు బదిలీ చేసి ఆయన స్థానంలో దేవానంద్‌ను ఇక్కడకు పంపారు. అలాగే నలుగురు హెచ్‌ఓలకు బదిలీ ఉత్తర్వులు అందాయి. గుంటూరుకు బదిలీ అయిన మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. అలాగే వ్యవసాయ, ఉద్యానశాఖలో పలువురు అధికారులు మంగళవారం రిలీవ్ అయ్యారు.

'సాక్షి' కార్యాలయాలపై దాడులు అరికట్టాలి

- నిందితులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు



పుట్టపర్తి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న పాత్రికేయులు

పుట్టపర్తి టౌన్: నిజాన్ని నిర్భయంగా రాస్తూ బాధితులకు బాసటగా నిలుస్తున్న 'సాక్షి' కార్యాలయాలపై దాడులను అరికట్టి, దుండగులను కఠినంగా శిక్షించాలని జర్నలిస్టులు, ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జర్నలిస్టులు, ప్రజా సంఘాల నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో జర్నలిస్టులు మాట్లాడారు. టీవీలో చర్చ సందర్భంగా ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలను 'సాక్షి'కి ఆపాదించడం సరికాదన్నారు. చర్చలో పాల్గొన్న వ్యక్తి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆయన వ్యక్తిగతమన్నారు. అయినప్పటికీ ఏపీ ప్రభుత్వం కక్షగట్టి డిబేట్‌లో వ్యాఖ్యాతగా ఉన్న సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయించిందన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై దాడులు జరిగాయన్నారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన పత్రికలపైనే దాడులు చేశారంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. అనంతపురంలోని సాక్షి కార్యాలయంపై కూడా వరుసగా రెండురోజులు కూటమి పార్టీల నేతలు దాడులు చేశారన్నారు. దీని వెనుక పెద్ద రాజకీయ కుట్ర ఉందన్నారు. అందువల్ల దాడి ఘటనలో పాల్గొన్న వారిని అరెస్టు చేసి వారి వెనుక ఎవరు ఉన్నారో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. పత్రికల్లో, టీవీల్లో ఏదైనా ఓ కథనం, చర్చ అభ్యంతరకరంగా ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపాలి గానీ, గూండాలతో దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇప్పటికైనా పాలకులు బుద్ధి తెచ్చుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. పుట్టపర్తిలో జరిగిన కార్యక్రమంలో జర్నలిస్టులు సాయికృష్ణారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్

కిడ్నీ బాధితులకు చికిత్సలో భాగంగా కీలకంగా అందజేసే డయాలసిస్ ప్రక్రియ అవసానదశలో కొట్టుమిట్టాడుతోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సొంత నియోజకవర్గ కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఎంతటి దుర్భర పరిస్థితులు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి నియోజక వర్గంలోనే దారుణమైన పరిస్థితులు
- డయాలసిస్ చేసే సమయంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం
- నాలుగు నెలలుగా పనిచేయని జనరేటర్
- ప్రాణాలు ఉగ్గపట్టుకుంటున్న రోగులు


ధర్మవరంలోని డయాలసిస్ కేంద్రంలో కరెంటు లేక ఆగిపోయిన యంత్రాలు


కరెంటు కోతతో 3 గంటలపాటు బయటే నీరసంతో పడిపోయిన కిడ్నీ బాధితుడు


నాలుగు నెలలుగా పనిచేయని జనరేటర్

ధర్మవరం అర్బన్: డయాలసిస్ అనగానే గుండె గుభేలుమంటుంది! మరణానికి చేరువైపోయామోననే భావన రోగుల్లో వ్యక్తమవుతుంటుంది. శరీరంలోని వ్యర్థాలను తొలగించే మూత్రపిండాలు మొరాయిస్తే, వాటి పనిని యంత్రాలకు అప్పగించడమే డయాలసిస్. దాదాపు 80 శాతం పాడయ్యేవరకూ కిడ్నీలు తమ విధిని సక్రమంగానే నిర్వహిస్తాయి. ఆ తర్వాత నుంచి క్రమక్రమంగా పని చేయడానికి మొండికేస్తాయి. దీనినే వైద్య పరిభాషలో 'కిడ్నీ ఫెయిల్యూర్' అంటారు. ఇలాంటి సమయంలో రోగి బతకాలంటే 'డయాలసిస్' తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. అయితే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం రోగుల ప్రాణాలకు భరోసానివ్వలేకపోతోంది. డయాలసిస్ చేసే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుని యంత్రాలు ఆగిపోతున్నాయి. దీంతో రోగులు తీవ్ర అస్వస్థతకు లోనవుతున్నారు. ఆయాసం ఎక్కువై ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. దీంతో ప్రాణాలు ఉగ్గబట్టుకోవాల్సిన దారుణమైన పరిస్థితి నెలకొంటోంది.

నాలుగు నెలలుగా పనిచేయని జనరేటర్

ధర్మవరంలోని మారుతీనగర్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మాతాశిశు సంరక్షణ కేంద్రం నూతన భవనాన్ని నిర్మించి, ప్రారంభించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ కేంద్రంలోనే ఐదు పడకల డయాలసిస్ కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. కేంద్రం నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీకు అప్పగించారు. ఏజెన్సీ ద్వారా రోజూ 5 నుంచి 15 మంది రోగులకు డయాలసిస్ నిర్వహిస్తుంటారు. డయాలసిస్ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండరాదు. అయితే నాలుగు నెలలుగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం చోటు చేసుకుంటుండంతో డయాలసిస్ రోగులు నరక యాతన అనుభవిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అధిగమించేలా ఏర్పాటు చేసిన జనరేటర్ సైతం పనిచేయడం లేదు. దీంతో ఒక్కో రోగికి డయాలసిస్ ప్రక్రియ పూర్తి చేయడానికి పది గంటల కంటే ఎక్కువ సమయం పడుతోంది.

పట్టించుకోని ఏజెన్సీ

డయాలసిస్ సెంటర్‌లో జనరేటర్ పనిచేయడం లేదనే అంశాన్ని రహీ కేర్ ఏజెన్సీకి సిబ్బందితో పాటు కిడ్నీ బాధితులూ ఫోన్ చేసి చెప్పినా ఫలితం లేకపోయింది. ఏజెన్సీ మేనేజర్ వీరా నిర్లక్ష్యపు సమాధానాలతో ఫోన్ కట్ చేస్తున్నాడని పలువురు రోగులు వాపోతున్నారు. ఇదే అంశాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని రోగులు కోరారు. అయినా అక్కడ కూడా వారికి నిరాశే ఎదురైంది.

మౌలిక సౌకర్యాలు లేవు

డయాలసిస్ సెంటర్‌ను భవనం పై అంతస్తులో ఏర్పాటు చేయడంతో నడవలేని స్థితిలో ఉన్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెంటర్‌లో ఉన్న ఒక్క వీల్‌చైర్ సరిగా లేదు. కిడ్నీ రోగులకు డయాలసిస్ చేసే సమయంలో అనారోగ్యానికి గురైతే వెంటనే ఆక్సిజన్ పెట్టాల్సి ఉంది. అయితే సెంటర్‌లో ఆక్సిజన్ సౌకర్యం లేదు. రోగి తీవ్ర అనారోగ్యానికి గురైతే వెంటనే మరో ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ సదుపాయం కూడా లేదు. సెంటర్‌లో కనీసం తాగేందుకు మంచినీరు కూడా అందుబాటులో లేకపోవడంతో రోగులతో పాటు వారి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదిరోజుల క్రితం రోగి మృతి

ధర్మవరంలోని కదిరిగేటు సమీపంలో ఉండే కిడ్నీ బాధితుడు రెడ్డప్పకు డయాలసిస్ చేస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిపోయింది. జనరేటర్ లేకపోవడంతో కరెంటు వచ్చే వరకూ వేచి ఉన్నాడు. ఆ సమయంలో ఆయాసం ఎక్కువై తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపు మృతిచెందాడు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండి ఉన్నా... లేదా, జనరేటర్ పనిచేసి ఉన్నా రెడ్డప్ప ప్రాణాలతో ఉండేవాడని కిడ్నీ బాధితులు అంటున్నారు.

ఎప్పుడు పోతుందో చెప్పలేం



డయాలసిస్ చేసే సమయంలో తరచూ కరెంటు పోతోంది. దీంతో నాలుగు గంటలు సమయం పట్టే డయాలసిస్‌కు 10 గంటలవుతోంది. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. డయాలసిస్ చేసే సమయంలో కరెంటు పోతే మాకు శరీరంలో రక్త ప్రసరణ సరిగ్గా జరగక నరక యాతన అనుభవిస్తుంటాం. అధికారులు స్పందించి జనరేటర్‌ను బాగు చేయించాలి.

– నాగరత్న, కిడ్నీ బాధితురాలు, గొట్లూరు గ్రామం, ధర్మవరం

వారానికి మూడుసార్లు వస్తున్నా



నా ఆరోగ్య పరిస్థితి ఏ మాత్రం బాగాలేదు. ఫిబ్రవరి నుంచి వారానికి మూడుసార్లు డయాలసిస్‌కి వస్తున్నా. డయాలసిస్ సమయంలో కరెంటు పోతే ఆయాసం పెరిగి పోతోంది. బీపీ తగ్గిపోయి, షుగర్ లెవల్స్ పడిపోయి కాళ్లు, చేతులు వాపులు వస్తున్నాయి. జనరేటర్ పనిచేయడంలేదని రహీ కేర్ ఏజెన్సీ వారికి ఫోన్ చేస్తే పట్టించుకోవడంలేదు. విద్యుత్ శాఖ ఏఈకి ఫోన్ చేస్తే మాకేమి సంబంధం అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. పదిరోజుల క్రితం రెడ్డప్ప అనే రోగికి డయాలసిస్ చేసే సమయంలో కరెంటు పోయి చనిపోయాడు. ఆక్సిజన్ లేకపోవడంతోనే అతను చనిపోయినట్లుగా తెలిసింది. ఈ పరిస్థితి మరొకరికి రాకుండా చర్యలు తీసుకోవాలి.

– ప్రభాకర్, కిడ్నీ బాధితుడు, ధర్మవరం

ప్రాణాలు పోయే పరిస్థితి



కిడ్నీలు చెడిపోయి సగం ప్రాణంతో బతుకుతున్నాం. డయాలసిస్ చేయించుకుంటునే మాకు బతుకు. అయితే గంటల కొద్ది కరెంటు పోతోంది. దీంతో డయాలసిస్ చేసే సమయంలో మిషన్లు ఆగిపోతున్నాయి. జనరేటర్ కూడా పని చేయడం లేదు. ఇప్పటికైనా డయాలసిస్ కేంద్రానికి విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నారాయణస్వామి, కిడ్నీ బాధితుడు, మల్కాపురం

క్లుప్తంగా

యోగాంధ్ర ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని ఆర్డీఓ మహేష్‌కు సూచించారు. మంత్రి సత్యకుమార్, కలెక్టర్ చేతన్, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట తహసీల్దార్ నటరాజ్, ఎంపీడీఓ సాయిమనోహర్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

ధర్మవరం అర్బన్: వ్యక్తిపై దాడికి పాల్పడిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ధర్మవరం టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్న షేక్ అన్వర్‌పై ముగ్గురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. అన్వర్ భార్య ముబీనా అక్క హసీనా భర్త 14 సంవత్సరాల క్రితం మృతిచెందడంతో ఆమె ఇందిరమ్మకాలనీలో నివసిస్తున్న ఇంతియాజ్ బాషాతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. బక్రీద్ రోజు హసీనాను ఇంటికి పిలిచి ఇలాంటి సంబంధాలు మంచివి కావని అన్వర్, ముబీనా హితవు పలికారు. ఈ విషయాన్ని ఇంతియాజ్‌కు హసీనా తెలపడంతో అతను ఆదివారం తన స్నేహితులు చాంద్‌బాషా, మహేష్‌తో కలసి అన్వర్ ఇంటికెళ్లి దాడి చేసి గాయపరిచారు. గాయపడిన భర్తను స్థానిక ప్రభుత్వాస్పత్రి భార్య ముబీనా తీసుకెళ్లి చికిత్స చేయించారు. కోలుకున్న అనంతరం మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆరు టన్నుల చీనీ కాయల అపహరణ

బత్తలపల్లి: పక్వానికి వచ్చిన ఆరు టన్నుల చీనీ కాయలను రాత్రికి రాత్రే దుండగులు అపహరించుకెళ్లారు. వివరాలు.. బత్తలపల్లి మండలం తిమ్మనకొట్టాల గ్రామానికి చెందిన ఎరికల గోపాల్.. డి.చెర్లోపల్లి సమీపంలోని సర్వే నెంబర్ 468లో తనకున్న పది ఎకరాల్లో నుంచి మూడు ఎకరాలు వరి సాగు చేయగా, మిగిలిన ఏడు ఎకరాల్లో చీనీ పంట సాగు చేస్తున్నాడు. పదేళ్లగా పంట చేతికి అందుతోంది. ఈ సారి కూడా పక్వానికి వచ్చిన కాయలను రెండు రోజుల తరువాత తొలగించాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం సాయంత్రం తోటలోకి వెళ్లి చూడగా 150 చెట్లలోని సుమారు ఆరు టన్నుల చీనీకాయలను అపహరించుకెళ్లినట్లుగా గుర్తించాడు. దీని విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.2.10 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. కాగా, పది రోజుల క్రితం మాలగుండ్లపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరరెడ్డి తోటలోని చీనీకాయలను కూడా దుండగులు అపహరించిన వైనం మరువక ముందే ఎరికల గోపాల్ తోటలో కాయలు అపహరణకు గురి కావడంతో రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఘటనపై బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


మోదీ పాలన స్వర్ణ యుగం

- రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడిచిందని, ఈ 11 ఏళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ పటిష్టం చేసి స్వర్ణ యుగంలా మార్చాడని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్కరణల అమలుతో దేశాభివృద్ధికి ప్రధాని మోదీ బాటలు వేశారన్నారు. ప్రధానంగా రైతులు, పేదలు, యువకులు, మహిళల అభ్యున్నతికి పెద్ద పీట వేశారన్నారు. ఇటీవల పాకిస్తాన్ విషయంలో ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలు విద్రోహులను ముప్పతిప్పలు పెట్టాయన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ తోక ముడిచేలా చేశారన్నారు. సాధ్యం కాని ఎన్నో పనులను ఆచరణలో పెట్టి చూపారన్నారు. అధికారం కట్టబెట్టిన ప్రజల రుణం తీర్చుకునేలా మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెడతామని పేర్కొన్నారు.


భూసార పరీక్షలు చేయించుకోండి


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త త్రికళ మాధవి

పుట్టపర్తి అర్బన్: రైతులే స్వయంగా తమ పొలాల్లోని మట్టిని తీసుకెళ్లి భూసార పరీక్షలు చేయించుకుని పంటల సాగు చేపట్టాలని జాతీయ నూనె గింజల పరిశోధనా స్థానం డాక్టర్ దొరై మురుగన్, కేవీకే రెడ్డిపల్లి శాస్త్రవేత్త డాక్టర్ త్రికళ మాధవి అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి గ్రామాల్లో ఐసీఏఆర్, న్యూఢిల్లీ సహకారంతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలపై రైతులను చైతన్య పరిచారు. రైతు సంక్షేమ కార్యక్రమాల కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం పలువురు రైతులకు భూసార పరీక్ష పత్రాలు, ఇద్దరు అభ్యుదయ రైతులకు కంది విత్తనాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో రేకులకుంట ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏడీఏ సనావుల్లా, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల


మాట్లాడుతున్న షర్మిల

పుట్టపర్తిటౌన్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావడం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమవుతుందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. మంగళవారం పుట్టపర్తిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం రాబోవు రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు సాగిస్తామన్నారు.

మొండిగా ముందుకు..

- ఫిర్యాదులను పట్టించుకోకుండా ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌కు సిద్ధమైన విద్యాశాఖ
- అడ్డుకున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు
- 8 గంటల ఆలస్యంగా 10.30 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ప్రక్రియ కోసం వేచి చూస్తున్న టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల్లో అత్యధికులైన సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల్లో విద్యాశాఖ అధికారులు సీనియార్టీ జాబితాలో అసంబద్ధాలు తొలగించకుండానే మొండిగా ముందుకు వెళ్లాలని చూశారు. అయితే, ఫిర్యాదులను పట్టించుకోకుండా కౌన్సెలింగ్‌కు సిద్ధమవడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు అడ్డుకోవడంతో గందరగోళం నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ స్కూల్‌లో సీరియల్ నంబరు 1 నుంచి 350 వరకు ఉన్న టీచర్లకు బదిలీలు చేపడతామని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లా నలుమూల నుంచి ఉరుకులు, పరుగులతో ఎస్జీటీలు కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.

తీవ్ర ఇబ్బందులు..

కౌన్సెలింగ్ కేంద్రంలో తాగేందుకు కూడా నీటి వసతి కల్పించకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో సాంకేతిక కారణాలు అంటూ, ఉన్నతాధికారుల నుంచి లింక్ రాలేదంటూ రాత్రి 9 గంటల దాకా గడిపారు. ఎట్టకేలకు 9.30 గంటల సమయంలో కౌన్సెలింగ్ ప్రారంభిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు మైకుద్వారా ప్రకటించారు. ముందుగా జాబితాలోని 1 నుంచి 30 మంది టీచర్లు రావాలని పిలవగా.. ఉపాధ్యాయ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. అనేక ఫిర్యాదులు ఇచ్చినా అవేవీ పట్టించుకోకుండా సీనియార్టీ జాబితాలో మార్పు చేయకుండా ఎలా నిర్వహిస్తారంటూ నిలదీశారు. ఒక టీచరుకు 32 పాయింట్లు రావాల్సి ఉండగా 27 పాయింట్లు వచ్చాయని, రెండుసార్లు రీఆపోర్స్‌మెంట్‌కు గురైన మరో టీచరుకు రావాల్సిన 7 ప్రత్యేక పాయింట్లు వేయలేదని, తాత్కాలిక సీనియార్టీ జాబితాలో ఉన్న స్పౌజ్ పాయింట్లు ఫైనల్ జాబితాలో కనిపించడం లేదని.. ఇలా పదుల సంఖ్యల్లో సమస్యలు ఉన్నాయన్నారు. దీంతో సీనియార్టీలో వందల వేలల్లో తేడా వస్తోందంటూ వాపోయారు. ఇవేవీ పరిష్కరించకుండా వారిని అన్యాయం చేస్తారా అని నిలదీశారు. కమిషనర్ నుంచి అనుమతులు తీసుకుని వాటన్నింటినీ పరిష్కరించిన తర్వాతనే కౌన్సెలింగ్ జరపాలంటూ పట్టుబట్టారు.

పోలీసులకు సమాచారం

ఇంతలో విద్యాశాఖ అధికారులు పోలీసులకు సమాచారం అందించగా.. రాప్తాడు పోలీసులు చేరుకున్నారు. అయినా ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెనక్కి తగ్గలేదు. నిబంధనల మేరకు రావాల్సిన పాయింట్లు వేసే వరకు జరపకూడదంటూ తెగేసి చెప్పారు. దీంతో డీఈఓ పలుమార్లు ఆర్జేడీ, రాష్ట్ర అధికారులతో ఫోన్‌లో మాట్లాడాల్సి వచ్చింది.

150 మందికి మాత్రమే కౌన్సెలింగ్

తొలి 150 మందికి సంబంధించిన సీనియార్టీలో ఎలాంటి సమస్యలు లేకపోవడంతో చివరకు ఆ 150 మందికి మాత్రమే జరుపుతామన్నా సంఘాల నాయకులు ఒప్పుకోలేదు. చివరకు పలువురి జోక్యంతో వారికి కౌన్సెలింగ్ చేసేందుకు ఒప్పుకున్నారు. ఇదే విషయాన్ని డీఈఓ ప్రకటించారు. అయితే వారికి కూడా బుధవారం ఉదయం ఫైనల్ సీనియార్టీ జాబితాలో మార్పులు చేసి ప్రకటిస్తామని వెల్లడిస్తామన్నారు. దీంతో మధ్యాహ్నం నుంచి పడిగాపులు కాసిన వారు ఉసూరుమంటూ వెనుతిరిగారు.

స్టీల్ ప్లాంట్‌లో వలస కార్మికుడి మృతి

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం తూముకుంట పారిశ్రామిక వాడలోని మీనాక్షి స్టీల్ పరిశ్రమలో బీహార్‌కు చెందిన వలస కార్మికుడు జుబ్లాల్ మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం పరిశ్రమలో పనిచేస్తుండగా టీఎంటీ స్టీల్ రాడ్ అతని కడుపులోకి దూసుకెళ్లింది. తోటి కార్మికులు వెంటనే హిందూపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందించడానికి అక్కడి వైద్యులు నిరాకరించడంతో జిల్లాస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించి జుబ్లాల్ మృతిచెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, విషయం తెలుసుకున్న కార్మిక సంఘం నేత రవికుమార్ ఆస్పత్రికి చేరుకుని జుబ్లాల్ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్టీల్ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు లోపించాయని మండిపడ్డారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుని కార్మికులు గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు చేపట్టి భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి పరిహారం అందించాలని కోరారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను సీఐ శివగంగాధర్ రెడ్డి, డాక్టర్ మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో దాదాపు 550 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ రావు తెలిపారు. విజేతలు ఈనెల 23 నుంచి 25 వరకు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

చైతన్య పాఠశాల ఎదుట ధర్నా

- ఫర్నీచర్ ధ్వంసం చేసిన విద్యార్థి సంఘం నాయకులు



కదిరిలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

కదిరి అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కదిరిలోని శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యాపారం చేస్తున్న పాఠశాలపై విద్యాశాఖాధికారులు తనిఖీలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఆన్‌లైన్ ద్వారా శ్రీచైతన్య విద్యాసంస్థలు ఇంటికే పుస్తకాలు పంపుతున్నారని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ప్రీ ప్రైమరీ అడ్మిషన్లను చేపట్టారని మండిపడ్డారు. సీబీఎస్‌సీ, ఇంటర్నేషనల్ విద్య పేరుతో రూ.లక్షల మేర ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ధర్నాలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్ర, నాగార్జున, బాబ్జాన్, గణేష్, అఖిల్, మహేష్‌నాయక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫర్నీచర్ ధ్వంసంపై సమాచారం అందుకున్న సీఐ నారాయణరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు విద్యార్థి సంఘాల నాయకులపై కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా ఎస్ఎఫ్ఐ మహేంద్ర, బాబ్జాన్, ఎంఎస్ఎఫ్ సాకే హరి, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ గణేష్, ఎంఎస్ఎఫ్ సోము, రాజుతో పాటు మరో 10 మంది పాఠశాలలో అక్రమంగా ప్రవేశించినట్లు గుర్తించారు.

• ధర్మవరం వాసి నేత్రదానం


సేకరించిన నేత్రాలను అందిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు


రేపాకుల రమేష్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: స్థానిక మార్కెట్ వీధికి చెందిన రేపాకుల రమేష్(58) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు వైకే శ్రీనివాసులు, పోలా ప్రభాకర్, డాక్టర్ బీవీ సుబ్బారావు, జయరామ్, మోహన్.. మృతుని కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో మృతుని నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప పర్యవేక్షణలో కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, భాస్కర్‌రెడ్డి, రఘువీరా సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని కుమార్తెలు రేపాకుల శ్రుతి, శ్రీరక్షకు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేత్రాలు మరో ఇద్దరికి చూపును అందిస్తాయని తెలిపారు.

నీట మునిగి బాలుడి మృతి


దీక్షిత్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: ప్రమాదవశాత్తు చెరువు పడిన బాలుడు నీట మునిగి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామానికి చెందిన ప్రసాద్, అంజలి దంపతుల కుమారుడు దీక్షిత్ (7) ఉన్నాడు. గ్రామ శివారులోని చెరువులో మంగళవారం దుస్తులు ఉతికేందుకు వెళుతున్న తన అవ్వ నాగలక్ష్మమ్మతో కలసి దీక్షిత్ కూడా వెళ్లాడు. అవ్వ దుస్తులు ఉతుకుతున్న సమయంలో గట్టున ఉన్న దీక్షిత్ ప్రమాదవశాత్తూ నీటిలో పడిపోయాడు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో నాగలక్ష్మమ్మ వేసిన కేకలు వృథా అయ్యాయి. వెంటనే గ్రామంలోకి వెళ్లి విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో తాత కాటమయ్యతో పాటు చుట్టుపక్కల వారు చెరువు వద్దకు చేరుకుని గాలించి వెలికి తీసేలోపు బాలుడు మృతిచెందాడు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు.